# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## 3 గంటలంటే ఎవుసం బందు పెట్టాల్సిందే..

చిన్నగూడూరు : కాంగ్రెసోళ్లు చాలంటున్న మూడు గంటల కరెంటుతో వ్యవసాయం బందుపెట్టి పని కోసం పట్నాలకు వలస పోవాల్సిందే. కేసీఆర్ పుణ్యమాని 24 గంటల కరెంట్‌తో ఇప్పుడిప్పుడే ఓ రేవున బతుకుతున్నం. మళ్లీ కాంగ్రెసోనికి పెత్తనం ఇస్తే రైతుల చావులు తప్పవు. రైతులను ఆగం చేసేందుకు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు,10హెచ్‌పీ మోటర్లని చెబుతున్నడు. ఏసీల్లో కూసొని గాలి మాటలు చెప్పే కాంగ్రెసోనికి రైతు కష్టాలేమెరుక. సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంటే కరెక్ట్. **– గంగాధరి వెంకన్న, రైతు, ఉగ్గంపల్లి**

## 10 హెచ్‌పీ మోటర్లకు కరెంటు ఇవ్వడం కాంగ్రెసోళ్లకు చేతనైతదా?



డోర్నకల్ : బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లు పెడితే కరెంటు ఇవ్వడం కాంగ్రెసోళ్లకు చేతనైతదా? ఓట్ల కోసం డ్రామాలాడుతున్నది. నోటికొచ్చిన హామీలు ఇస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు భయానక పరిస్థితులు ఉండేవి. కరెంటు కోతలతో పంటలు ఎండిపోతుంటే ఎవలకు చెప్పుకోవాలో తెలిసేది కాదు. తెలంగాణ సర్కారు వచ్చినంకనే 24 గంటల నాణ్యమైన కరెంటు కరెక్ట్‌గా ఇస్తున్నది. ఇది సరిపోతది. మాకు వీలున్నప్పుడల్లా మోటర్లు పెట్టుకొని పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నం. మా రైతుల మద్దతు సీఎం కేసీఆర్‌కే.

– చెక్కల నాగేశ్వరావు, మోటర్ మెకానిక్, తోడేళ్లగూడెం

## ధరణి పోతే రైతులు ఆగమే..



డోర్నకల్ : తెలంగాణ సర్కారు తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో మా భూములు భద్రంగా ఉన్నయి. రైతుబంధు పైసలు ఠక్కున మా బ్యాంకు ఖాతాల పడుతానయి. కష్టం వచ్చి భూమి అమ్ముకున్నా, భూమి కొన్నా క్షణాల్ల పని అయితాంది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తమంటున్నరు. ధరణి పోతే ఇంకేమన్నా ఉన్నదా. పాత రెవెన్యూ పద్ధతులతో ఆగమాగం చేస్తరు. దళారులదే రాజ్యం నడుస్తది. పటేల్, పట్వారీ వ్యవస్థలు వస్తే లంచాలు ఇచ్చుకోలేక మళ్లీ భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి వస్తది. రైతు కష్టాలను దగ్గర నుంచి చూసిన కేసీఆర్ ధరణిని తెచ్చి మా కష్టాలు తీర్చిండు. ఆయనకు రుణపడి ఉంటం. ధరణిని తీసేస్తమన్న కాంగ్రెసోళ్లను తెలంగాణ నుంచి తరిమికొట్టాలి.

– అక్కి వెంకయ్య, తోడేళ్ల గూడెం

## కష్టాలు తప్పవు..



నర్సింహులపేట: తెలంగాణ సర్కారు తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతుల భూములు భద్రంగా ఉన్నయి. ఒకరి భూములు మరొకరి పేరు మీద మార్చే వీలు లేదు. ఇంత మంచిగ రైతులకు ఉపయోగపడుతున్న ధరణిని తీసేస్తామనడం కాంగ్రెస్ నాయకుల తెలివి తక్కువ తనం. ధరణి పోతే రైతులకు కష్టాలు తప్పవు. దళారుల దందా మళ్లీ మొదలైతది. లంచాల కోసం మమ్ములను పీక్కతింటరు.

**– లకావత్ బిచ్చు, రైతు, బీల్యాతండా**

## దళారుల రాజ్యమే..



పెద్దవంగర: సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి చాలా బాగుంది. భూమి కొన్నా, అమ్మినా తహసీల్దార్ ఆఫీసులో అర గంటలో పేరు మార్పిడి అయితాంది. 15-20 రోజుల్లో మన ఇంటికే పట్టాపాస్ పుస్తకం వస్తాంది. లంచాలు, అక్రమాలు అసలే లేవు. ఇంత మంచి ధరణిని తీసేస్తామనడం కాంగ్రెస్‌కు తగదు. ధరణి తీసేస్తే మళ్లీ దళారులు వత్తరు. లంచాల బాధ మొదలై రైతులు ఆఫీసుల సుట్టూ తిరుగాల్సివత్తది. కాంగ్రెసోళ్లకు ఎవుసంపై అవగాహన లేదు. కేసీఆర్ రైతు బిడ్డగా భూ సమస్యలను పరిష్కరించేందుకే ధరణి తీసుకొచ్చి భూఇబ్బందులు లేకుండా చేసిండు. ఎలాంటి మోసం లేకుండా పనులు సక్రమంగా జరుగుతున్నయి. సంతోషంగా ఉంది.

**–సోమా అశోక్, ఉప్పరగూడెం గ్రామం**



## ఎవుసం తెలిసినోడు అలా మాట్లాడడు..

గూడూరు : ఎవుసం గురించి తెలిసినోడు 3 గంటల కరంట్ చాలని బలుపు మాటలు మాట్లాడడు. అసలు మూడు గంటల కరెంటుతో ఒక్క మడైనా తడుస్తదా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంటు కోతలు, లో వోల్టేజీతో మోటర్లు, స్టార్టర్లు కాలిపోయేవి. కండ్ల ముందే పంటలు ఎండిపోతుంటే గుండెలు పగిలేవి. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ ఇస్తున్న 24 గంటల కరెంటుతో ఇప్పుడిప్పుడే మా ముఖాలు తెల్లబడుతున్నయి. రంది లేకుంట బతుకుతున్నం. మళ్లీ వచ్చి మా ముఖాలకు మసి పూస్తరా ఏంది? ఈ నాయకులను మేం నమ్మం. రైతుబంధు, ఉచిత కరెంట్ ఇచ్చి పెద్దన్నలా మమ్ములను కేసీఆర్ ఆదుకుంటున్నడు. మళ్లా 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లంటూ మా జోలికి రావద్దు.

**– రైతు బానోత్ వాల్యా, గూడూరు**



## మూడు గంటల కరెంట్‌తో బాగుపడ్డట్టే..

పెద్దవంగర : మూడు గంటల కరెంట్ అంటే రైతులు బాగుపడ్డట్టే. అట్లా కరెంట్ ఇస్తే ఒక్కమడి కూడా తడవదు. గతంలో కాంగ్రెసోళ్లు అట్లానే ఇస్తే ఎండకాలంలో ఒక్క మడి కూడా తడిసేది కాదు. సలికాలం వస్తే గజగజ వణుక్కుంటూ బావులు, బోర్ల కాడ మంటలు పెట్టుకొని పండేది. అబ్బో అప్పుడు ఎన్నో కట్టాలు పడ్డం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక 24 గంటలు మంచి కరెంట్ ఇవ్వడంతో ఎన్కటిలెక్క ఇబ్బందులు లేవు. మూడు గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అంటున్న కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు. కష్టసుఖాల్లో మన ఇంటి మనిషి లెక్కతోడు ఉంటున్న కేసీఆర్‌కే మద్దతు ఇవ్వాలె.

**–జిలుకర అంజయ్య, ఉప్పరగూడెం, పెద్దవంగర**

## 10హెచ్‌పీ మోటర్లు అవసరం లేదు



నర్సింహులపేట: రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడేతే ఖర్చు తడిసి మోపెడవుతుంది. కాంగ్రెస్ ఇస్తామంటున్న మూడు గంటల కరెంటుతో పది గుంటల మడి కూడా తడవదు. 600 ఫీట్లలోతులో నీళ్లు ఉంటే 10 హెచ్‌పీ మోటర్లు అవసరం. వీటిని వాడాలంటే సపరేట్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లు, కేబుల్ ఉండాలి. ఖరీదు ఎక్కువ. తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడిస్తున్న 24 గంటల నాణ్యమైన కరెంటు రైతులకు చాలు. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లతో పొలాలు మంచిగ పారుతున్నయి.10 హెచ్‌పీ మోటర్ల అవసరం లేనేలేదు. వారికి ఎవుసం మీద అవగాహన లేదు.

**– పానుగంటి దేవేంద్రాచారి, మోటర్ మెకానిక్, కొమ్ములవంచ**

## 3గంటల కరెంటుతో పంటలు పండించలేం..



కేసముద్రం: కాంగ్రెసోళ్లు చెప్పినట్టు రైతులందరూ 10హెచ్‌పీ మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి. 10 హెచ్‌పీ మోటర్‌తో 3గంటల్లో ఎకరం కూడా పారదు. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేనట్టుంది. ఎకరం మక్కజొన్న పారాలంటే కనీసం 6, 7 గంటలు పడుతుంది. 3 గంటల కరెంటు ఇస్తే పంటలు పండించలేం. మళ్లీ రైతులకు కష్టాలు మొదలైతయి. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చినంక 24 గంటల కరెంటుతో సమయం దొరికినప్పుడు పంట పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్నం. సీఎం కేసీఆర్ పాలనలోనే రైతులు రంది లేకుంట ఉన్నరు.

**– బానోత్ జామ్లా, తార్‌సింగ్ తండా**



## ధరణితోనే రైతులకు బతుకు..

చిన్నగూడూరు : ధరణితోనే రైతులు ధైర్యంగ బతుకుతున్నరు. భూమికి భద్రత ఉన్నది. కాంగ్రెస్ పాలనలో భూమి రిజిస్ట్రేషన్ చేయించాలంటే అధికారుల సుట్టూ నెలల తరబడి తిరిగేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. స్లాట్ బుక్ చేసుకున్నామంటే నిమిషాల్లో రిజిస్ట్రేషన్ అవుతున్నది. కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తమంటున్నరు. ధరణిపోతే మళ్లీ పట్వారీలు, దళారుల రాజ్యం వస్తది. రైతులకు చుక్కలు చూపిస్తురు. అందుకే కేసీఆర్ మా లాంటోళ్ల గురించి ఆలోచించే ధరణి తీసుకొచ్చి మంచి ఆలోచన చేసింది. ధరణి ఎప్పటికీ ఉండాల్సిందే.

**– ధరంసోత్ పూల్‌సింగ్, రైతు, ఉగ్గంపల్లి**